వనం..మనం.. మనఊరి కోసం
RNI/APTEL/26/A3829
ప్రభ
# మనం
TELUGU DAILY తెలుగు డైలీ
Gmail: prabhamanam@gmail.com

విలేకరులు కావలెను.
WANTED... WANTED...
ఆంధ్ర, తెలంగాణ నుండి
వెలువడుతున్న తెలుగు జాతీయ దినపత్రిక
ప్రభ మనం తెలుగు దినపత్రికలో
పనిచేయుటకు అన్ని జిల్లాల వారిగా స్టాఫ్ రిపోర్టర్లు,
ఆర్సీ ఇంచార్జీలు, సిటీ ఇంచార్జీలు మరియు మండల
విలేకరులు కావలెను.
ఆసక్తి ఉన్నవారు సంప్రదించండి.
ఎడిటర్: వి. లింగమూర్తి
9000367833, 8074937223

కర్నూలు : ఎడిటర్ - వడ్డే లింగమూర్తి | సంపుటి : 1 సంచిక : 57 | పేజీలు : 4 వెల రూ./-4 | email: prabhamanam@gmail.com | గురువారం 16- 07 - 2026

# అది రాష్ట్ర ద్రోహం దేశ ద్రోహంతో సమానం

- మూడేళ్లలో 36 సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేస్తామని సీఎం చంద్రబాబు ప్రకటన
- రూ. 35 వేల కోట్ల బడ్జెట్‌తో పనులు చేపడతామని వెల్లడి
- రాష్ట్ర జీవనాడి పోలవరం ప్రాజెక్టును మార్చి 2027 నాటికి పూర్తి చేస్తామని స్పష్టం
- గత ఐదేళ్లలో ప్రాజెక్టుల నిర్వహణ పూర్తిగా విఫలమైందని విమర్శలు
- కేఎల్ రావు జయంతి, పట్టిసీమ జలహారతి కార్యక్రమంలో కీలక హామీలు




ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం సమీపంలో కృష్ణా-గోదావరి పవిత్ర సంగమం వేదికగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు గత ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. రాష్ట్రానికి జీవనాడి అయిన

## తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డికి ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ లేఖ



- షాబాద్ ఘటనపై రేవంత్ రెడ్డికి పవన్ కల్యాణ్ లేఖ
- పోక్సో చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని విజ్ఞప్తి
- పోక్సో కేసు నిందితుడు ఆరుగురిని హత్య చేసిన వైనం
- పోలీసుల వైఫల్యం వల్లే ఈ ఘోరం జరిగిందని పవన్ ఆరోపణ
- బాధితులకు రక్షణ కల్పించడంలో విఫలమయ్యారని విమర్శ

తెలంగాణ రాష్ట్రం షాబాద్‌లో చోటుచేసుకున్న ఘోర సామూహిక హత్యల ఘటనపై ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తీవ్ర - మిగతా 2 లో

# గతంలో మమ్మల్ని అడ్డుకున్నారు

ఇప్పుడు జగన్‌కు పూర్తి స్వేచ్ఛనిస్తున్నాం: లోకేశ్



- జగన్ రాయలసీమ బిడ్డ కాదు.. సీమకు పట్టిన క్యాన్సర్ గడ్డ అని వ్యాఖ్యలు
- బ్రాహ్మణి స్టీల్స్, ఓబులాపురం దోపిడీతోనే సాక్షి మీడియా ఏర్పాటు అని ఆరోపణ
- వాళ్లు ఫ్యాక్షన్ తెస్తే.. మేం ఫ్యాక్టరీలు తెచ్చి ఉద్యోగాలిస్తున్నాం అని వెల్లడి
- ఆర్థిక ఇబ్బందులున్నా సంక్షేమ పథకాలను కొనసాగిస్తున్నామని ఉద్ఘాటన

"గత వైసీపీ ప్రభుత్వ హయాంలో చంద్రబాబును ఇంటి నుంచి బయటకు రానీయకుండా గేట్లకు తాళాలు - మిగతా 2 లో

## హర్మూజ్ జలసంధికి ప్రత్యామ్నాయం.. యూఏఈ వ్యూహాత్మక అడుగు



- ఫుజైరాలో కొత్త పోర్టు, కంటైనర్ టెర్మినల్ నిర్మాణం
- ప్రాంతీయ ఉద్రిక్తతల కారణంగా షిప్పింగ్‌కు ప్రత్యామ్నాయ మార్గం
- తూర్పు తీరంలో లాజిస్టిక్స్ సామర్థ్యాన్ని పెంచుకుంటున్న యూఏఈ

పర్షియన్ గల్ఫ్ ప్రాంతంలో నెలకొన్న తీవ్ర ఉద్రిక్తతల నేపథ్యంలో, వ్యూహాత్మక ప్రాధాన్యత కలిగిన హర్మూజ్ జలసంధికి ప్రత్యామ్నాయ మార్గాన్ని - మిగతా 2 లో

# అమల్లోకి భారత్-యూకే ట్రేడ్ డీల్

- ఏవి చౌకగా దొరుకుతాయి.. ఏ రంగాలకు అధిక లాభమంటే..!
- ఇవాళ్టి నుంచి అమల్లోకి వచ్చిన భారత్-యూకే సమగ్ర వాణిజ్య ఒప్పందం
- భారత ఎగుమతులపై దాదాపు 99 శాతం వరకు సుంకాల రద్దు
- స్కాచ్ విస్కీ, లగ్జరీ కార్లు, కాస్మెటిక్స్ వంటివి భారత్‌లో చౌకయ్యే అవకాశం
- టెక్స్‌టైల్స్, లెదర్, ఫార్మా రంగాలకు భారీగా ప్రయోజనం చేకూరనున్న వైనం
- 2030 నాటికి ఇరుదేశాల వాణిజ్యం 120 బిలియన్ డాలర్లకు చేరే అవకాశం




భారత్, యునైటెడ్ కింగ్‌డమ్ (యూకే) మధ్య ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న సమగ్ర ఆర్థిక, వాణిజ్య ఒప్పందం (సీఈటీఏ) ఇవాళ్టి నుంచి అమల్లోకి వచ్చింది. ఈ చారిత్రక ఒప్పందంతో ప్రపంచంలోని అతిపెద్ద వినియోగదారుల మార్కెట్లలో ఒకటైన యూకేలో భారత ఎగుమతిదారులకు అపారమైన అవకాశాలు లభించనున్నాయి. అదే సమయంలో పలు ప్రీమియం బ్రిటిష్ ఉత్పత్తులు భారత కొనుగోలుదారులకు తక్కువ ధరలకే అందుబాటులోకి రానున్నాయి. ఈ ఒప్పందం ఇరు దేశాల మధ్య పెట్టుబడి సంబంధాలను బలోపేతం చేయడంతో పాటు ఉద్యోగ కల్పనను ప్రోత్సహించి, భారత తయారీ, సేవా రంగాలకు కొత్త

## అయోధ్య రామమందిరం సీఈఓ పోస్టుకు అనూహ్య స్పందన



- అయోధ్య రామమందిరం సీఈఓ పోస్టుకు దరఖాస్తుల వెల్లువ
- నోటిఫికేషన్ ఇచ్చిన రెండు రోజుల్లో వెయ్యికి పైగా అప్లికేషన్లు
- పరిపాలన, ఆర్థిక వ్యవహారాలను పటిష్టం చేసేందుకు ఈ నియామకం
- దరఖాస్తుదారుల్లో ఎక్కువగా రిటైర్డ్ బ్యూరోక్రాట్లు, ఉన్నతాధికారులు
- విరాళాల దుర్వినియోగం ఆరోపణల నేపథ్యంలో ఈ కీలక నిర్ణయం

అయోధ్య రామమందిరం నిర్వహణ కోసం శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ నూతనంగా ప్రకటించిన ప్రధాన - మిగతా 2 లో

# కేంద్రమంత్రి కుమారస్వామితో కేటీఆర్ భేటీ



- ఆదిలాబాద్ సీసీఐ ఫ్యాక్టరీ పునరుద్ధరణపై కేంద్రమంత్రితో కేటీఆర్ భేటీ
- కేంద్ర, రాష్ట్రాలు చెరో రూ.250 కోట్లు ఇస్తే ప్లాంట్ ప్రారంభించవచ్చని ప్రతిపాదన
- ప్లాంట్ తెరిస్తే 6,000 మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి లభిస్తుందని వివరణ
- కేటీఆర్ వినతిపై సానుకూలంగా స్పందించిన కేంద్రమంత్రి కుమారస్వామి
- హామీ నెరవేర్చకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించిన కేటీఆర్

తెలంగాణలోని ఆదిలాబాద్‌లో గత కొన్నేళ్లుగా మూతపడి ఉన్న సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) కర్మాగారాన్ని తక్షణమే పునరుద్ధరించాలని భారత - మిగతా 2 లో

# తెలంగాణలో వింత వాతావరణం

రేపు 5 జిల్లాలకు ఉక్కపోత హెచ్చరిక!



- తెలంగాణలో జులై 22 వరకు పొడి వాతావరణం
- 5 జిల్లాల్లో వేడి, ఉక్కపోత ఉంటుందని ఐఎండీ హెచ్చరిక
- రాష్ట్రంలోని 28 జిల్లాల్లో బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం
- పలు జిల్లాల్లో వర్షాభావం, హన్మకొండలో 65 శాతం లోటు నమోదు
- హైదరాబాద్‌లో 36 డిగ్రీల వరకు చేరనున్న గరిష్ఠ ఉష్ణోగ్రత

తెలంగాణలో రుతుపవనాలు బలహీనపడటంతో వర్షాకాలంలోనూ పొడి వాతావరణం కొనసాగుతోంది. రాష్ట్రంలో వర్షపాతం లోటు ఆందోళన కలిగిస్తుండగా, మరోవైపు ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. - మిగతా 2 లో

# పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుకు సంబంధించి త్వరలోనే శుభవార్త


- 90 టీఎంసీల నీటి వినియోగానికి అనుమతులు సాధిస్తామని వెల్లడి
- మహబూబ్‌నగర్‌లో అమర రాజా తయారీ యూనిట్‌ను ప్రారంభించిన రేవంత్
- పరిశ్రమల్లో స్థానికులకే అత్యధిక ఉద్యోగాలు ఇవ్వాలని సూచన
- పాలమూరును ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దుతామని హామీ




పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకానికి సంబంధించి త్వరలోనే శుభవార్త వింటారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు. మహబూబ్‌నగర్ జిల్లా దివిటిపల్లిలో 'అమర రాజా గ్రూప్' నెలకొల్పిన తయారీ యూనిట్‌ను ప్రారంభించిన సందర్భంగా నిర్వహించిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. ఈ ప్రాజెక్టు ద్వారా 90 టీఎంసీల నీటిని వినియోగించుకునేలా కేంద్రంతో పాటు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాన్ని ఒప్పించి, అవసరమైన అనుమతులు సాధించే దిశగా అడుగులు వేస్తున్నామని ప్రకటించారు. అదేవిధంగా, డిండి ప్రాజెక్టుకు 30 టీఎంసీల నీటి కేటాయింపులపై కూడా చర్చలు కొనసాగుతున్నాయని వెల్లడించారు. కృష్ణా బేసిన్ పరిధిలోని దిండి, పాలమూరు-రంగారెడ్డి, కల్వకుర్తి తదితర ప్రాజెక్టులను సకాలంలో పూర్తి చేసి ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాను సస్యశ్యామలం చేసే బాధ్యతను తాను స్వీకరిస్తానని సీఎం హామీ ఇచ్చారు. అత్యంత వెనుకబడిన ఈ ప్రాంతాన్ని అభివృద్ధి పథంలో నిలిపి, ఒక ఆదర్శ జిల్లాగా

# హుస్సేన్ సాగర్ సమీపంలో భారీ ప్రాజెక్టు

- ప్రదీప్ కన్‌స్ట్రక్షన్స్‌కు హైకోర్టులో ఊరట
- హుస్సేన్ సాగర్ ఎఫ్‌టీఎల్ ప్రాజెక్ట్ విషయంలో ప్రదీప్ కన్‌స్ట్రక్షన్స్‌కు ఊరట
- ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించి తెలంగాణ హైకోర్టులో అనుకూల తీర్పు
- చట్టపరమైన వివాదాలతో ఆలస్యమైన పనులు వేగవంతమయ్యే అవకాశం



తెలంగాణలోని మౌలిక సదుపాయాల రంగంలో కీలకమైన ఓ ప్రాజెక్టుకు సంబంధించి ముఖ్యమైన పరిణామం చోటుచేసుకుంది. హైదరాబాద్ హుస్సేన్ సాగర్ ఫుల్ ట్యాంక్ లెవల్ (ఎఫ్‌టీఎల్) పరిధిలోని - మిగతా 2 లో

మనం
TELUGU DAILY
RNI/APTEL/26/A3829



# తెలంగాణలో వింత వాతావరణం

మొదటిపేజీ తరువాయి – ఈ నేపథ్యంలో, రేపు (జులై 16) ఐదు జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో వేడి, ఉక్కపోతతో కూడిన వాతావరణం ఉంటుందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) హెచ్చరించింది. బుధవారం విడుదల చేసిన బులెటిన్ ప్రకారం.. ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో గురువారం తీవ్రమైన ఉక్కపోత ప్రభావం చూపే అవకాశం ఉంది. వీటితో పాటు రాష్ట్రంలోని 28 జిల్లాల్లో బలమైన ఈదురుగాలులు వీస్తాయని పేర్కొంది. హైదరాబాద్, దాని పరిసర ప్రాంతాల్లో ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుందని, గరిష్ఠ ఉష్ణోగ్రత 36 డిగ్రీలు, కనిష్ఠ ఉష్ణోగ్రత 26 డిగ్రీల సెల్సియస్‌గా నమోదయ్యే అవకాశం ఉందని తెలిపింది. రాష్ట్రవ్యాప్తంగా జులై 22 వరకు పొడి వాతావరణమే కొనసాగుతుందని, తేలికపాటి జల్లులు మినహా భారీ వర్షాలకు అవకాశం లేదని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. ఇప్పటికే పలు జిల్లాల్లో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. ఒక్క హన్మకొండ జిల్లాలోనే ఈ జులై నెలలో ఇప్పటివరకు 65 శాతం వర్షపాతం లోటు నమోదైంది. పగటి ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతుండగా, ఇటీవల నల్గొండలో 38.9 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత రికార్డయింది. బంగాళాఖాతంలో అల్పపీడనం ఉన్నప్పటికీ, రుతుపవన ద్రోణి రాష్ట్రంలో వర్షాలకు అనుకూలంగా లేకపోవడమే ఈ పరిస్థితికి కారణమని నిపుణులు విశ్లేషిస్తున్నారు. రానున్న మూడు రోజుల్లో గంటకు 30-40 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు వీచే అవకాశం ఉందని ఐఎండీ వెల్లడించింది.

# పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుకు సంబంధించి తొందర్లోనే శుభవార్త

మొదటిపేజీ తరువాయి – తీర్చిదిద్దేందుకు సహకరించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. పరిశ్రమల స్థాపన కోసం భూములిచ్చిన రైతులకు తగిన న్యాయం జరగాలని, అలాగే స్థానిక యువతకే గరిష్ట స్థాయిలో ఉపాధి అవకాశాలు కల్పించాలని యాజమాన్యానికి సూచించారు. అంతకుముందు, అమర రాజా గిగా కారిడార్‌లో ఏర్పాటు చేసిన 'కస్టమర్ క్వాలిఫికేషన్ ప్లాంట్' తయారీ యూనిట్‌ను ముఖ్యమంత్రి ప్రారంభించారు. పర్యావరణ మార్పుల నేపథ్యంలో కాలుష్య నియంత్రణకు ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ) వినియోగం పెరగాల్సిన అవసరం ఉందని, ఈ తరుణంలో బ్యాటరీల తయారీ యూనిట్‌ను ఇక్కడ స్థాపించడం ముదావాహమని పేర్కొన్నారు. స్థానిక యువతకు పెద్దపీట వేస్తూ ఉపాధి కల్పిస్తున్న అమర రాజా సంస్థ యాజమాన్యాన్ని ఈ సందర్భంగా ఆయన అభినందించారు. రాష్ట్రానికి భారీగా పెట్టుబడులను ఆకర్షించే లక్ష్యంతో 'తెలంగాణ రైజింగ్ 2047' ప్రణాళికను రూపొందించామని, పారిశ్రామిక విధానాల్లో మరిన్ని సంస్కరణలు తీసుకొచ్చామని సీఎం వివరించారు. అంతర్జాతీయ సంస్థలతో పోటీ పడుతూ అమరరాజా గ్రూప్ దేశానికి గర్వకారణంగా నిలుస్తోందని ఆయన ప్రశంసించారు.

# హుస్సేన్ సాగర్ సమీపంలో భారీ ప్రాజెక్టు

మొదటిపేజీ తరువాయి – నిర్మాణాలకు సంబంధించి ప్రదీప్ కన్‌స్ట్రక్షన్స్ సంస్థకు తెలంగాణ హైకోర్టులో ఊరట లభించింది. తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు సదరు నిర్మాణ సంస్థపై ఎలాంటి కఠిన చర్యలు తీసుకోవద్దని న్యాయస్థానం ఆదేశించింది. సోమాజిగూడ నెక్లెస్ రోడ్డు సమీపంలో ప్రదీప్ కన్‌స్ట్రక్షన్స్ ఒక భారీ బహుళ అంతస్తుల భవన నిర్మాణాన్ని చేపట్టింది. అయితే, ఈ నిర్మాణం ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉందంటూ జీహెచ్‌ఎంసీ నోటీసులు జారీ చేసింది. ఈ నోటీసులను సవాల్ చేస్తూ సదరు సంస్థ హైకోర్టును ఆశ్రయించింది. ఇరు పక్షాల వాదనలు విన్న న్యాయస్థానం, తదుపరి ఆదేశాలు వెలువడే వరకు సదరు నిర్మాణ ప్రాజెక్టు విషయంలో యథాతథస్థితిని కొనసాగించాలని స్పష్టం చేసింది. భవన నిర్మాణంపై ఎటువంటి బలవంతపు చర్యలు చేపట్టవద్దని ఆదేశించింది. అలాగే, ఈ వ్యవహారానికి సంబంధించిన పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని జీహెచ్‌ఎంసీ తరపు న్యాయవాదికి ధర్మాసనం సూచించింది. జీహెచ్‌ఎంసీ చట్టం సెక్షన్ 450 కింద ప్రాజెక్టుకు మంజూరు చేసిన భవన నిర్మాణ అనుమతులను ఎందుకు రద్దు చేయకూడదో వివరణ ఇవ్వాలంటూ జూలై 7న జీహెచ్‌ఎంసీ షోకాజ్ నోటీసు ఇచ్చింది. ఈ నేపథ్యంలో ప్రదీప్ కన్‌స్ట్రక్షన్స్ హైకోర్టును ఆశ్రయించగా, విచారణ చేపట్టిన ధర్మాసనం సదరు సంస్థకు అనుకూలంగా తాత్కాలిక ఆదేశాలు జారీ చేసింది.

# తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డికి ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ లేఖ

మొదటిపేజీ తరువాయి – దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ దుర్ఘటనపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆయన బుధవారం ఒక లేఖ రాశారు. పోక్సో చట్టాన్ని మరింత పకడ్బందీగా అమలు చేయాలని, బాధితులకు పూర్తిస్థాయి భద్రత కల్పించేలా కఠిన చర్యలు చేపట్టాలని ఆ లేఖలో విజ్ఞప్తి చేశారు. షాబాద్‌లో జరిగిన ఈ దారుణ ఉదంతాన్ని పవన్ కల్యాణ్ తన లేఖలో ప్రధానంగా ప్రస్తావించారు. పోక్సో కేసులో నిందితుడిగా ఉన్న రాజ్‌కుమార్, 16 ఏళ్ల బాధితురాలితో పాటు ఆమె తల్లి, నానమ్మను పొట్టనబెట్టుకున్నాడు. ఆ తర్వాత తనతో గొడవపడుతుందని భార్య, ఇద్దరు పిల్లలను చంపేసి, ఆపై తాను కూడా ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ దారుణం వ్యవస్థీకృత వైఫల్యానికి నిదర్శనమని పవన్ కల్యాణ్ ఆవేదన వ్యక్తం చేశారు. పోక్సో కేసుల్లో దర్యాప్తులో నిర్దిష్ట కాలపరిమితిని పాటించాలని, సాక్ష్యాధారాలు తారుమారుకు తావులేకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. సదరు కేసులో నిందితుడికి ముందస్తు బెయిల్ లభించడం, అదే సమయంలో బాధితుల కుటుంబానికి తగిన రక్షణ కల్పించడంలో పోలీసులు విఫలమవడంపై పవన్ తీవ్ర విమర్శలు గుప్పించారు. పోక్సో కేసులకు అత్యున్నత ప్రాధాన్యత ఇవ్వాలని సుప్రీంకోర్టు గతంలో పలుమార్లు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు.

# అది రాష్ట్ర ద్రోహం, దేశ ద్రోహంతో సమానం

మొదటిపేజీ తరువాయి – పోలవరం ప్రాజెక్టును పూర్తిగా నిర్వీర్యం చేయడం రాష్ట్ర ద్రోహం, దేశ ద్రోహంతో సమానమని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. డాక్టర్ కేఎల్ రావు 124వ జయంతి వేళ, పట్టిసీమ నుంచి కృష్ణా డెల్టాకు నీటిని విడుదల చేసిన సందర్భంగా ఏర్పాటు చేసిన 'జలహారతి' కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. గత ఐదేళ్ల పాలనలో సాగునీటి రంగంపై నిర్లక్ష్యం చూపారంటూ గణాంకాలతో సహా ఎండగట్టారు. ఒక వ్యక్తి ప్రాధాన్యతల కోసం రాష్ట్ర ప్రజల భవిష్యత్తును, రైతాంగ ప్రయోజనాలను ఫణంగా పెట్టారని తీవ్రంగా ఆరోపించారు.

విమర్శలనే కాదు.. వారి మోసాన్ని మ్యూజియంలో పెడతా

గత ప్రభుత్వ వైఫల్యాలను ఏకరువు పెట్టిన చంద్రబాబు, వారి పాలనలో జరిగిన మోసపూరిత చర్యలను తీవ్రంగా ఖండించారు. "వెలిగొండ ప్రాజెక్టు పనులు పూర్తికాకుండానే, సొరంగంలో యంత్రం ఇరుక్కుపోయిన విషయాన్ని దాచిపెట్టి, ప్రాజెక్టును జాతికి అంకితం చేస్తున్నట్లు బోర్డు పెట్టి నాటకాలడారు. ప్రజలను ఇంత దారుణంగా మోసం చేస్తారా? వారి మోసానికి ప్రతీక అయిన ఆ ప్రారంభోత్సవ బోర్డును మ్యూజియంలో పెట్టి, ప్రజలకు శాశ్వతంగా గుర్తుండేలా చేస్తాను" అని సంచలన వ్యాఖ్యలు చేశారు. 2019-24 మధ్య కాలంలో ప్రాజెక్టుల గేట్లకు కనీసం గ్రీజు కూడా పూయని దుస్థితి ఉండేదని, పులిచింతల, గుండ్లకమ్మ గేట్లు కొట్టుకుపోయినా పట్టించుకోలేదని విమర్శించారు. కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించకపోవడంతో పనులు చేసేందుకు ఎవరూ ముందుకు రాని దారుణమైన పరిస్థితిని సృష్టించారని మండిపడ్డారు. తాము ఎంతో కష్టపడి పూర్తి చేసిన పట్టిసీమ ప్రాజెక్టును 'వట్టిసీమ', 'దండగ' అని ఆనాడు ప్రతిపక్షంలో ఉండి విమర్శించిన వారే, అధికారంలోకి వచ్చాక దాని విలువను గుర్తించలేకపోయారని అన్నారు. "నేను ఆ రోజు వారి విమర్శలకు భయపడి ఉంటే, ఈ పదేళ్లలో కృష్ణా డెల్టా పరిస్థితి ఏమై ఉండేదో ఒక్కసారి ఆలోచించండి. పట్టిసీమ ద్వారా గడిచిన పదేళ్లలో 450 టీఎంసీల గోదావరి జలాలను కృష్ణాకు తరలించి 13 లక్షల ఎకరాలను స్థిరీకరించాం" అని చంద్రబాబు స్పష్టం చేశారు.

### 36 ప్రాజెక్టులు, 3 సంవత్సరాలు

విమర్శలకే పరిమితం కాకుండా, రాష్ట్రాన్ని జల సమృద్ధంగా మార్చేందుకు తమ ప్రభుత్వ బృహత్ ప్రణాళికను చంద్రబాబు ఆవిష్కరించారు. రాబోయే మూడేళ్లలో రాష్ట్రంలోని 36 కీలక సాగునీటి ప్రాజెక్టులను రూ.35 వేల కోట్ల వ్యయంతో పూర్తి చేస్తామని ప్రకటించారు. ఈ సందర్భంగా పలు ప్రాజెక్టుల పూర్తికి స్పష్టమైన గడువులను నిర్దేశించారు. "రాష్ట్రానికి జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టును 2027 మార్చి నాటికి పూర్తి చేసి జాతికి అంకితం చేస్తాం. ఇప్పటికే 37 సార్లు భౌతికంగా, 37 సార్లు వర్చువల్‌గా సమీక్షలు నిర్వహించాను. పునరావాసంపై ప్రత్యేక దృష్టి సారించి నిర్వాసితులకు న్యాయం చేస్తాం" అని హామీ ఇచ్చారు. తాను 1996లో శంకుస్థాపన చేసిన వెలిగొండ ప్రాజెక్టు తొలిదశను ఈ ఏడాది సెప్టెంబర్ 1న ప్రారంభిస్తామని తెలిపారు. వీటితో పాటు వంశధార-నాగావళి-గోదావరి-కృష్ణా-పెన్నా నదుల అనుసంధానం తన చిరకాల స్వప్నమని, దానిని సాకారం చేసే దిశగా అడుగులు వేస్తామని పునరుద్ఘాటించారు. గుంటూరు ఛానల్ ఆధునికీకరణ, చింతలపూడి ఎత్తిపోతల, వరికపూడిశెల వంటి అనేక ప్రాజెక్టుల పూర్తికి నిర్దిష్ట తేదీలను ప్రకటించి, ప్రభుత్వం యొక్క చిత్తశుద్ధిని చాటుకున్నారు.

మహనీయుల స్ఫూర్తితో ముందుకు

ఈ సందర్భంగా డాక్టర్ కేఎల్ రావు, సర్ ఆర్థర్ కాటన్, శివరామకృష్ణయ్య, నందమూరి తారక రామారావు వంటి మహనీయులు సాగునీటి రంగానికి చేసిన సేవలను చంద్రబాబు స్మరించుకున్నారు. వారి దూరదృష్టి వల్లే ఈరోజు రాష్ట్రం అన్నపూర్ణగా నిలిచిందన్నారు. మంచి పనులు చేసిన వారిని ప్రజలు ఎప్పటికీ గుర్తుపెట్టుకుంటారని, చెడును ఖండించాల్సిన బాధ్యత కూడా ప్రజలపై ఉందని హితవు పలికారు. తాము అధికారంలోకి వచ్చాక ధవళేశ్వరం, తుంగభద్ర బ్యారేజీల గేట్లను యుద్ధప్రాతిపదికన మార్పించామని, నిర్వహణ లోపాలను సరిదిద్దుతున్నామని తెలిపారు.

# కేంద్రమంత్రి కుమారస్వామితో కేటీఆర్ భేటీ

మొదటిపేజీ తరువాయి – రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. బుధవారం న్యూఢిల్లీలో కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ మంత్రి హెచ్.డి. కుమారస్వామితో సమావేశమైన ఆయన, ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు. కేటీఆర్‌తో పాటు సీసీఐ సాధన సమితి ప్రతినిధులు, రైతులు, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు జోగు రామన్న, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర తదితరులతో కూడిన ప్రతినిధి బృందం కేంద్రమంత్రిని కలిసింది. ఈ ప్లాంట్ పునరుద్ధరణ ద్వారా వెనుకబడిన ఆదిలాబాద్ ప్రాంతం యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని, తద్వారా ఈ ప్రాంతం పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతుందని కేటీఆర్ వివరించారు. దాదాపు 2,300 ఎకరాల్లో విస్తరించి ఉన్న ఈ ప్లాంట్‌కు ఏటా 4 లక్షల టన్నుల ఉత్పత్తి సామర్థ్యం ఉందని, సుమారు 100 ఏళ్లకు సరిపడా సున్నపురాయి నిల్వలు అక్కడ ఉన్నాయని కేటీఆర్ గుర్తుచేశారు. ఇంతటి విలువైన ప్రభుత్వ ఆస్తి నిరుపయోగంగా మారి తుప్పు పట్టకుండా కాపాడాలని ఆయన కోరారు. సుమారు రూ.2,000 కోట్ల పెట్టుబడితో అక్కడ అత్యాధునిక ప్లాంట్‌ను ఏర్పాటు చేయవచ్చని ప్రతిపాదించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెరో రూ.250 కోట్ల చొప్పున 'వయబిలిటీ గ్యాప్ ఫండింగ్' అందిస్తే, ప్లాంట్ కార్యకలాపాలను పునఃప్రారంభించవచ్చని కేటీఆర్ సూచించారు. దీనివల్ల ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 6,000 మందికి ఉపాధి లభిస్తుందని పేర్కొన్నారు. కేటీఆర్ విన్నపంపై కేంద్రమంత్రి కుమారస్వామి సానుకూలంగా స్పందించారు. వైజాగ్ స్టీల్ ప్లాంట్‌కు అందించిన తరహాలోనే ఇక్కడి ప్లాంట్‌కు కూడా మద్దతు ఇవ్వాలని, లేనిపక్షంలో ఫ్యాక్టరీని తెరిపించే వరకు తమ పోరాటం కొనసాగుతుందని కేటీఆర్ స్పష్టం చేశారు.

### మీడియాతో మాట్లాడిన కేటీఆర్

ఢిల్లీలో కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ, బీఆర్ఎస్ పోరాటం, ఆందోళన తెలంగాణ ప్రయోజనాల కోసమే అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై వ్యక్తిగతంగా తనకు ఎలాంటి ద్వేషం లేదని, అయితే ఆయన తీసుకుంటున్న ప్రజా వ్యతిరేక నిర్ణయాలను మాత్రమే తాము ప్రశ్నిస్తున్నామని తెలిపారు. ప్రజల దృష్టిని మళ్లించడంలో రేవంత్ రెడ్డి అందెవేసిన చేయి అని, ఆ విద్యలో ఆయన ఇప్పటికే నాలుగైదు పీహెచ్‌డీలు చేశారని ఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చి 31 నెలలు గడుస్తున్నా, ఇప్పటికీ తమ పార్టీనే లక్ష్యంగా చేసుకోవడంపై కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ చచ్చిన పార్టీ అని వ్యాఖ్యానిస్తున్న ముఖ్యమంత్రి, మరి మళ్లీ తమ పార్టీనే ఎందుకు టార్గెట్ చేస్తున్నారని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి బాధ్యతారాహిత్యంగా మాట్లాడుతున్నారని, దీనిపై రాహుల్ గాంధీ ఎందుకు స్పందించడం లేదని నిలదీశారు. కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో ప్రభుత్వం కావాలనే రైతులను ఇబ్బందులకు గురిచేస్తోందని ఆరోపించారు. ముఖ్యమంత్రి 76 పర్యాయాలు ఢిల్లీకి వెళ్లినా, రాష్ట్రానికి కనీసం 76 పైసలైనా తీసుకువచ్చారా అని ప్రశ్నించారు. ఫోన్ ట్యాపింగ్ సహా పలు అంశాల్లో ఆధారాలు లేకుండా తమపై నిరాధార ఆరోపణలు చేస్తున్నారని ఆయన మండిపడ్డారు.

# హర్మూజ్ జలసంధికి ప్రత్యామ్నాయం.. యూఏఈ వ్యూహాత్మక అడుగు



మొదటిపేజీ తరువాయి – అభివృద్ధి చేయడంపై యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా, దుబాయ్‌కి చెందిన ప్రముఖ పోర్ట్స్ ఆపరేటర్ 'డీపీ వరల్డ్', దేశ తూర్పు తీరంలోని ఫుజైరాలో కొత్త మల్టీపర్పస్ పోర్టు, కంటైనర్ టెర్మినల్ నిర్మాణ పనులను వేగవంతం చేసింది. ఈ ప్రాజెక్టు అందుబాటులోకి వస్తే, నౌకలు ప్రమాదకరమైన హర్మూజ్ జలసంధి గుండా ప్రయాణించాల్సిన అవసరం లేకుండానే నేరుగా యూఏఈకి సరుకు రవాణా చేసే వెసులుబాటు కలుగుతుంది. ఇరాన్, ఒమన్ దేశాల మధ్య ఉన్న ఇరుకైన హర్మూజ్ జలసంధి ద్వారా ప్రపంచ చమురు అవసరాల్లో ఐదో వంతు రవాణా జరుగుతుంది. అయితే, గత కొన్ని నెలలుగా అమెరికా-ఇరాన్ మధ్య నెలకొన్న ఘర్షణలు, వాణిజ్య నౌకలపై జరుగుతున్న దాడుల కారణంగా ఈ మార్గంలో సరుకు రవాణాకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. దీని ప్రభావంతో, ప్రాంతీయ వాణిజ్యానికి కేంద్ర బిందువైన దుబాయ్‌లోని జెబెల్ అలీ పోర్టులో నౌకల రాకపోకలు కొన్ని సందర్భాల్లో 90 నుంచి 95 శాతం వరకు తగ్గినట్లు నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. ఈ సంక్షోభ పరిస్థితులను అధిగమించేందుకు యూఏఈ పకడ్బందీ వ్యూహాన్ని అమలు చేస్తోంది. ఫుజైరాలోని ఈ నూతన పోర్టు నేరుగా గల్ఫ్ ఆఫ్ ఒమన్‌తో అనుసంధానమై ఉంటుంది. ఇక్కడికి చేరిన సరుకును సుమారు 100 కిలోమీటర్ల దూరంలో ఉన్న దుబాయ్, అబుదాబి వంటి ప్రధాన నగరాలకు రోడ్డు మార్గం ద్వారా సులభంగా తరలించవచ్చు. ఈ భారీ ప్రాజెక్టు కోసం వందల మిలియన్ డాలర్ల పెట్టుబడి అవసరమని, సుమారు 18 నెలల్లో ఇది పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. లాజిస్టిక్స్ సామర్థ్యాన్ని పెంపొందించుకునే ఈ ప్రణాళికలో భాగంగా, షార్జాకు చెందిన 'గల్ఫ్‌టైనర్' సంస్థ సైతం సమీపంలోని ఖోర్ ఫక్కన్ పోర్టు విస్తరణ కోసం సుమారు 2 బిలియన్ డాలర్ల మేర పెట్టుబడి పెడుతోంది. భౌగోళిక రాజకీయ అనిశ్చితి నుంచి తమ ఆర్థిక వ్యవస్థను, సరఫరా వ్యవస్థను సురక్షితంగా కాపాడుకోవాలనే యూఏఈ దీర్ఘకాలిక లక్ష్యానికి ఈ పరిణామాలు అద్దం పడుతున్నాయి.

# అయోధ్య రామమందిరం సీఈఓ పోస్టుకు అనూహ్య స్పందన



కార్యనిర్వహణాధికారి (సీఈఓ) పోస్టుకు అనూహ్య స్పందన లభిస్తోంది. నోటిఫికేషన్ విడుదలైన రెండు రోజుల్లో వెయ్యికి పైగా దరఖాస్తులు ట్రస్టుకు అందడం విశేషం. ఆలయ పరిపాలన, ఆర్థిక వ్యవహారాలను మరింత క్రమబద్ధీకరించి, వృత్తిపరమైన ప్రమాణాలతో తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ట్రస్ట్ ఈ సీఈఓ పదవిని సృష్టించింది. దీని కోసం జులై 13వ తేదీన దరఖాస్తులను ఆహ్వానించగా, అభ్యర్థులలో అత్యధికులు విశ్రాంత బ్యూరోక్రాట్లు, మాజీ సీనియర్ పరిపాలనాధికారులు ఉండటం గమనార్హం. జూలై 18 సాయంత్రం 4 గంటల వరకు గడువు ఉన్నందున, దరఖాస్తుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. దరఖాస్తుల పరిశీలన నిమిత్తం ముగ్గురు సభ్యులతో కూడిన ఒక ఎంపిక కమిటీని ఇప్పటికే ఏర్పాటు చేశారు. ఈ పరిశీలన ప్రక్రియ జులై 19 నుంచి ప్రారంభం కానుంది. గడువు ముగిసిన వెంటనే షార్ట్‌లిస్ట్ చేయడం, ఇంటర్వ్యూల నిర్వహణ వంటి ప్రక్రియలు చేపడతారు. జూలై 22న జరగనున్న ట్రస్ట్ సమావేశంలో సీఈఓ నియామకంపై తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

### వివాదాల నేపథ్యంలోనే ఈ నియామకం

ఆలయ విరాళాల దారిమళ్లింపునకు సంబంధించి వచ్చిన ఆరోపణలపై విచారణ కొనసాగుతున్న తరుణంలో ఈ నియామక ప్రక్రియ ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ కేసులో ఇప్పటికే కొందరు సిబ్బందిని అరెస్ట్ చేయగా, ఉత్తరప్రదేశ్ ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) విచారణ జరుపుతోంది. ఈ క్రమంలోనే ఆలయ కార్యకలాపాల్లో పూర్తి పారదర్శకత, జవాబుదారీతనం తీసుకురావడమే లక్ష్యంగా సీఈఓను నియమిస్తున్నట్లు తెలుస్తోంది. మాజీ ఐపీఎస్ అధికారి అమితాబ్ ఠాకూర్ కూడా ఈ పదవికి దరఖాస్తు చేసినట్లు బహిరంగంగా ప్రకటించారు. ఎంపికైన సీఈవో పనితీరు ఆధారంగా ఆ తర్వాత పొడిగింపు ఉంటుంది. ట్రస్ట్ నిర్ణయాలను సమర్థవంతంగా అమలు చేయడం, ఆర్థిక వ్యవహారాలను పర్యవేక్షించడం మరియు ఆలయ కార్యకలాపాలు సజావుగా సాగేలా చూడటం వంటివి నూతన సీఈఓ ప్రధాన బాధ్యతలుగా ఉంటాయి.

# అమల్లోకి భారత్-యూకే ట్రేడ్ డీల్

**ఊపునిస్తుందని వాణిజ్య నిపుణులు విశ్లేషిస్తున్నారు.**

**భారత ఎగుమతిదారులకే అతిపెద్ద ప్రయోజనం**

మొదటిపేజీ తరువాయి – ఈ ఒప్పందంలో సింహభాగం ప్రయోజనం భారత ఎగుమతిదారులకే దక్కనుంది. యూకేకు భారత్ చేసే ఎగుమతుల్లో దాదాపు 99 శాతం వస్తువులపై ఇకపై సుంకాలు ఉండవు. అంటే.. ఇప్పటివరకు బ్రిటన్‌లో దిగుమతి సుంకాలతో సతమతమైన వేలాది భారత ఉత్పత్తులు ఇకపై సుంకాలు లేని ప్రవేశంతో యూరోప్, చైనా వంటి దేశాల ఉత్పత్తులకు గట్టి పోటీ ఇవ్వనున్నాయి. ముఖ్యంగా లక్షలాది మందికి ఉపాధి కల్పిస్తున్న కార్మిక-ఆధారిత రంగాలకు ఈ ఒప్పందం ఒక వరంలా మారనుంది. వస్త్రాలు, దుస్తులు, తోలు, పాదరక్షలు, రత్నాలు, ఆభరణాలు, సముద్ర ఉత్పత్తులు, ఇంజనీరింగ్ వస్తువులు, ఆటో విడిభాగాలు, ప్రాసెస్డ్ ఫుడ్, రసాయనాలు, ఫార్మాస్యూటికల్స్, వ్యవసాయ ఉత్పత్తుల రంగాలకు భారీ ప్రోత్సాహం లభిస్తుంది. సుంకాల తొలగింపుతో లాభాల మార్జిన్లు పెరిగి, ఉత్పత్తి పెరిగి, తయారీ కేంద్రాల్లో కొత్త ఉద్యోగాలు వస్తాయని పరిశ్రమ వర్గాలు ఆశిస్తున్నాయి. ఈ ఒప్పందంపై వయనా ప్రెసిడెంట్ కౌశల్ సంపత్ ఎన్డీటీవీతో మాట్లాడుతూ.. "భారత్-యూకే ఒప్పందం భారత ప్రపంచ వాణిజ్య ప్రయాణంలో ఒక కీలక మైలురాయి. ఇప్పటికే యూకే భారత ఐదో అతిపెద్ద ఎగుమతి గమ్యస్థానంగా ఉన్నప్పటికీ, మన దిగుమతుల్లో దాని వాటా కేవలం 1 శాతమే. ఇది సమతుల్య వాణిజ్యానికి ఇంకా చాలా అవకాశాలు ఉన్నాయని సూచిస్తోంది. ఈ ఒప్పందం ముఖ్యంగా ఎంఎస్‌ఎంఈలకు కొత్త అవకాశాలను అందిస్తుంది" అని వివరించారు.

### సేవా రంగానికి నూతన ఉత్తేజం

ఈ ఒప్పందం కేవలం వస్తువులకే పరిమితం కాలేదు. భారత ఐటీ కంపెనీలు, కన్సల్టింగ్ సంస్థలు, ఇంజనీర్లు, ఆర్కిటెక్ట్‌లు, అకౌంటెంట్లు, ఆరోగ్య సంరక్షణ నిపుణులు, విద్యా సేవా ప్రదాతలకు యూకే మార్కెట్‌లోకి ప్రవేశం సులభతరం కానుంది. ఈ ఒప్పందంలో 137 సేవా ఉప-రంగాలు ఉన్నాయి. అంతేకాకుండా, 'డబుల్ కంట్రిబ్యూషన్ కన్వెన్షన్ (ఐజజ)' అనే నిబంధన భారత నిపుణులకు ఎంతో మేలు చేయనుంది. దీని ప్రకారం, యూకేలో తాత్కాలికంగా పనిచేసే భారత ఉద్యోగులు ఐదేళ్ల వరకు రెండు దేశాల్లోనూ సామాజిక భద్రతా చందాలు చెల్లించాల్సిన అవసరం లేదు.

### భారత్‌లో చౌకగా లభించనున్న వస్తువులు ఇవే

వినియోగదారులకు ధరల తగ్గింపు వెంటనే కనిపించకపోయినా, దశలవారీగా సుంకాలు తగ్గడం వల్ల పలు బ్రిటిష్ ఉత్పత్తులు చౌకగా మారనున్నాయి. వాటిలో ముఖ్యమైనవి:

**స్కాచ్ విస్కీ**

**జిన్ ప్రీమియం బ్రిటిష్ కార్లు**

**లగ్జరీ మోటార్‌సైకిళ్లు**

**కాస్మోటిక్స్ చాక్లెట్లు, బిస్కెట్లు**

**వైద్య పరికరాలు**

**కొన్ని ఆహార ఉత్పత్తులు**

ముఖ్యంగా లగ్జరీ కార్లపై ప్రస్తుతం 110 శాతం వరకు ఉన్న దిగుమతి సుంకాలు, రాబోయే సంవత్సరాల్లో కోటా విధానం కింద గణనీయంగా తగ్గుతాయి. అయితే, ఈ తగ్గింపులు దశలవారీగా ఉంటాయని గమనించాలి.

### దిగుమతుల ఆవల అసలు ప్రాధాన్యత

చౌకగా లభించే లగ్జరీ వస్తువులు వార్తల్లో నిలిచినప్పటికీ, ఈ ఒప్పందం యొక్క నిజమైన ప్రాముఖ్యత ఎగుమతులలోనే ఉందని ఆర్థికవేత్తలు నమ్ముతున్నారు. ప్రపంచంలోని ఆరో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ అయిన యూకే మార్కెట్‌లోకి సులభమైన ప్రవేశం, ప్రపంచ వాణిజ్యంలో భౌగోళిక రాజకీయ అనిశ్చితి నెలకొన్న తరుణంలో భారత తయారీదారులకు తమ ఎగుమతులను విస్తరించుకోవడానికి గొప్ప అవకాశం కల్పిస్తుంది. ఈ ఒప్పందం ద్వారా తయారీ, ఆర్థిక సేవలు, పునరుత్పాదక ఇంధనం, విద్య, టెక్నాలజీ రంగాలలో బ్రిటిష్ పెట్టుబడులు భారత్‌కు మరింతగా వస్తాయని అంచనా. అసోచామ్ అంచనా ప్రకారం ఈ ఒప్పందంతో 2030 నాటికి ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం దాదాపు రెట్టింపు అయి 120 బిలియన్ డాలర్లకు చేరుకునే అవకాశం ఉంది. ప్రధాని నరేంద్ర మోదీ ఈ ఒప్పందాన్ని ఒక "చారిత్రక మైలురాయి"గా అభివర్ణించారు. ఇది రైతులు, కార్మికులు, ఎంఎస్‌ఎంఈలు, స్టార్టప్‌లు, ఆవిష్కర్తలకు అవకాశాలు సృష్టించి, 'వికసిత్ భారత్ 2047' లక్ష్య సాధనకు దోహదపడుతుందని ఆయన అన్నారు. అంతిమంగా ఈ ఒప్పందం భారత ఆర్థిక వ్యవస్థను అధునాతన ప్రపంచ మార్కెట్లతో మరింత లోతుగా అనుసంధానించడంలో ఒక వ్యూహాత్మక ముందడుగుగా నిలుస్తుంది.

# గతంలో మమ్మల్ని అడ్డుకున్నారు



మొదటిపేజీ తరువాయి – వేయించారు. కానీ ఈరోజు మేం జగన్ స్వేచ్ఛగా ఎక్కడికైనా వెళ్లేందుకు అనుమతిస్తున్నాం. ఇదే మాకూ, వారికీ ఉన్న తేడా" అని మంత్రి, టీడీపీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేశ్ అన్నారు. బుధవారం ప్రొద్దుటూరు నియోజకవర్గ టీడీపీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. "జగన్ రాయలసీమ బిడ్డ కాదు, ఈ సీమకు పట్టిన క్యాన్సర్ గడ్డ" అని లోకేశ్ ఘాటుగా విమర్శించారు. బ్రాహ్మణి స్టీల్స్ పేరుతో 14,000 ఎకరాల భూమిని కారుచౌకగా కొట్టేసి, 10,000 ఉద్యోగాలు ఇస్తామని చెప్పి ఒక్క ఇటుక కూడా పేర్చలేదని ఆరోపించారు. ఓబులాపురం గనుల నుంచి దోచుకున్న సొమ్ముతోనే సాక్షి పత్రిక, టీవీలను ఏర్పాటు చేశారని దుయ్యబట్టారు. ఐదేళ్ల పాలనలో కడప జిల్లాకు జగన్ చేసిందేమీ లేదని, ఆయన నియోజకవర్గమైన పులివెందులకు నీళ్లిచ్చింది కూడా చంద్రబాబేనని గుర్తుచేశారు. "గొడ్డలి పార్టీ ఫ్యాక్షనిజం తెస్తే, మేం ఫ్యాక్టరీలు తెస్తున్నాం. రాయలసీమలో వారు రక్తాన్ని పారిస్తే, మేం ఉద్యోగాల పంట పండిస్తున్నాం" అని లోకేశ్ అన్నారు. తమ ప్రభుత్వం జేఎస్‌డబ్ల్యూ స్టీల్ ప్లాంట్‌కు భూమిపూజ చేసిందని, ఎస్ఏఈఎల్ ఎనర్జీ ప్లాంట్‌ను ప్రారంభించిందని తెలిపారు. ఎంతచేసినా కార్యకర్తల రుణం తీర్చుకోలేం వైసీపీ హయాంలో దారుణహత్యకు గురైన బీసీ నేత నందం సుబ్బయ్య కుటుంబాన్ని ఆదుకుని, పిల్లలను ఎన్టీఆర్ ట్రస్ట్ స్కూల్‌లో చదివిస్తున్నామని చెప్పారు. ప్రస్తుతం రాష్ట్రం తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ, సంక్షేమ పథకాలను కొనసాగిస్తున్నామని లోకేశ్ స్పష్టం చేశారు. వైసీపీ హయాంలో ఎన్నిరకాలుగా ఇబ్బంది పెట్టినా ఎత్తిన పసుపు జెండా దించకుండా పార్టీకి అండగా నిలిచింది కార్యకర్తలేనని లోకేశ్ అన్నారు. ఎంతచేసినా వారి రుణం తీర్చుకోలేమని భావోద్వేగంతో చెప్పారు. "ప్రొద్దుటూరు నియోజకవర్గంలో యువగళం పాదయాత్ర సందర్భంగా నాపై కోడిగుడ్లతో దాడిచేసి, భయపెట్టాలని చూశారు, జి.ఓ. నెం.1 పేరుతో పాదయాత్రను అడ్డుకోవాలని విఫలయత్నం చేశారు. తెలుగుదేశం పార్టీకి కంచుకోట కడప జిల్లా. మధ్యలో రెండు ఎన్నికల్లో ఇబ్బందిపడినా గత ఎన్నికల్లో పోరాడిన కార్యకర్తలు పార్టీకి గత వైభవం తెచ్చారు. అధికారంలోకి వచ్చామని కష్టకాలాన్ని మర్చిపోకూడదు. నేను పాదయాత్ర బుక్ చూసినపుడు ఆనాటి స్మృతులన్నీ గుర్తుకువస్తుంటాయి" అని వివరించారు. ఈ నెల 24న రెండో విడత 'తల్లికి వందనం' నిధులను జమ చేయనున్నట్లు ప్రకటించారు. రూ.4000 పెన్షన్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లు వంటి హామీలను అమలు చేస్తున్నామన్నారు. వైఎస్ఆర్‌సిపి హయాంలో పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించామని, చెత్తపన్నును రద్దు చేశామని తెలిపారు. కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకు పార్టీలో సముచిత స్థానం కల్పిస్తామని, నాయకులందరూ వర్గాలను పక్కనపెట్టి కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రి సవిత, పార్లమెంటు పార్టీ అధ్యక్షుడు భూపేష్ రెడ్డి, ఎమ్మెల్యే వరదరాజులు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మనం
గురువారం 16- 07 - 2026

## వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మిగనూరు పట్టణ ప్రధాన కార్యదర్శి గుడికల్ అల్తాఫ్ గారి జన్మదిన వేడుకలు







**ఎమ్మిగనూరు, జూలై,15,ప్రభ మనం:** వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఎమ్మిగనూరు పట్టణ ప్రధాన కార్యదర్శి గుడికల్ అల్తాఫ్ గారి జన్మదిన వేడుకలు శ్రీమతి బుట్టా రేణుక గారి కార్యాలయంలో ఆమె సమక్షంలో ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా కేక్ కటింగ్ కార్యక్రమం నిర్వహించగా, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం శ్రీమతి బుట్టా రేణుక గారు మరియు ఆమె భర్త శ్రీ బుట్టా శివ నీలకంఠ గారు అల్తాఫ్ గారికి కేక్ తినిపించి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా శ్రీమతి బుట్టా రేణుక గారు మాట్లాడుతూ, అల్తాఫ్ గారు ఇలాంటి మరెన్నో జన్మదిన వేడుకలు ఆనందంగా జరుపుకోవాలని, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో అంచలాంచలుగా ఎదిగి ఉన్నతమైన పదవులు పొందాలని ఆకాంక్షించారు. పార్టీకి మరియు తనకు ఎల్లప్పుడూ అండగా నిలుస్తూ ప్రజా సేవలో ముందుండాలని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ఎమ్మిగనూరు నియోజకవర్గానికి చెందిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొని అల్తాఫ్ గారికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

## మండలంలో తెదేపా పార్టీ బలోపేతానికి ప్రతిఒక్కరు కృషి చేయాలి

మంత్రాలయం టీడీపీ మండలాధ్యక్షులు ఎస్ఎం గోపాల్ రెడ్డి





**మంత్రాలయం , జూలై 15,మనం న్యూస్ ;** మంత్రాలయం మండలంలో తెలుగుదేశం పార్టీ బలోపేతానికి ప్రతిఒక్కరు కృషి చేయాలని మంత్రాలయం టీడీపీ మండలాధ్యక్షులు ఎస్ఎం గోపాల్ రెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని సుంకేశ్వరి గ్రామంలో మంత్రాలయం టీడీపీ ఇన్చార్జ్ ఎన్. రాఘవేంద్ర రెడ్డి ఆదేశాలు మేరకు గ్రామ నాయకులు తో కలిసి సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, స్థానిక అభివృద్ధి, పార్టీ బలోపేతం, కార్యకర్తల సమన్వయం తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. అనంతరం మండలంలోని కార్యకర్తలు సమస్యలను టీడీపీ ఇంచార్జి దృష్టికి తీసుకువెళ్ళడం జరుగుతుందని , ఆ సమస్యలను టీడీపీ ఇంచార్జి ఎన్.రాఘవేంద్ర రెడ్డి సీఎం నారా చంద్రబాబు నాయుడు కార్యాలయానికి చేరవేసి ప్రతి సమస్యను త్వరలోనే పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ క్లస్టర్ ఇన్చార్జ్ చావిడి వెంకటేష్ , మాజీ జెడ్పీటీసీ లక్ష్మయ్య , కల్లుదేవకుంట సొసైటీ డైరెక్టర్ లక్ష్మన్న , ఎల్లెల్సీ వైస్ చైర్మన్ మాలపల్లి చంద్ర , బండరాళ్ళ నరసింహ , టీడీపీ మండల నాయకులు , కార్యకర్తలు ఉన్నారు.

## చర్చి నిర్మాణానికి రూ.50వేలు ఆర్థిక సాయం



**మంత్రాలయం ,జూలై 15,మనం న్యూస్ ;-** మంత్రాలయం మండల పరిధిలోని రాంపురం లో చర్చి నిర్మాణానికి బూదురు గ్రామ వైసీపీ నాయకుడు జక్కయ్య రూ. 50వేల రూపాయలు ఆర్థిక సాయం చేశారు. బుధవారం రాంపురం గ్రామానికి వెళ్ళి పాస్టరు రేవరెండ్ యేసన్న , సంఘ పెద్దలు రాజు తమాస్,రవి, సిమోను రూబేను ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సంఘ పెద్దలు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

## చట్టాలపై అవగాహన అవసరం



**మంత్రాలయం , జూలై 15,మనం న్యూస్ ;-** మహిళా చట్టాలపై బాలికలు అవగాహన పెంచుకోవాలని హెడ్ కానిస్టేబుల్ శ్రీ రాములు , కానిస్టేబుల్ రామకృష్ణ అన్నారు. బుధవారం మంత్రాలయం సిఐ దస్తగిరిబాబు , ఎస్ఐ మల్లికార్జున ఆదేశాలు మేరకు మండల పరిధిలోని వగరూర్ గ్రామంలో జెడ్పీహెచ్ హైస్కూల్ విద్యార్థులకు ఫోక్స్ , బాల్య వివాహాలు ,సైబర్ నేరాలు ట్రాఫిక్ నిబంధనలు , హెల్మెట్ వాడడం పై అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థులు క్రమశిక్షణ తో చదువులో రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు ఉన్నారు.

## రామకొండ గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం




**జూలై:15.( ప్రభ మనం న్యూస్):** తుగ్గలి మండల పరిధిలోని గల రామకొండ గ్రామం నందు వ్యవసాయ శాఖ అధికారులు పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని రైతులతో కలిసి బుధవారం రోజున నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పత్తికొండ ఏడిఏ మోహన్ విజయ్ కుమార్,ఏవో సురేష్ బాబు లు మాట్లాడుతూ రైతులకు ఎల్ నినో యొక్క ప్రభావం గురించి రైతులకు వారు అవగాహన కల్పించారు. అదేవిధంగా రైతులు పంటలకు సంబంధించి బీమాను తప్పకుండా చేయించుకోవాలని వారు రైతులకు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో వీఏఏ జాకీర్,రైతులు తదితరులు పాల్గొన్నారు.

# అశేష అభిమానులు, సమక్షంలో ఘనంగా నరవ దంపతుల వివాహ దినోత్సవ వేడుకలు

వేడుకను సేవా కార్యక్రమంగా మార్చిన నరవ దంపతులు

జెడ్పీ.పి.హెచ్.ఎస్ విద్యార్థులకు విద్యా సామగ్రి పంపిణీ







**పెద్దకడబూరు,జూలై,15,ప్రభ మనం:** ప్రజాసేవను జీవిత ధ్యేయంగా ఎంచుకుని ప్రజల మన్ననలు పొందుతున్న తెలుగుదేశం పార్టీ జిల్లా అధికార ప్రతినిధి శ్రీమతి నరవ శశిరేఖ, నరవ రమాకాంత్ రెడ్డి దంపతుల వివాహ దినోత్సవ వేడుక, పెద్దకడబూరు,వారి స్వగృహం నందు,సన్నిహితులు, అభిమానులు, శ్రేయోభిలాషులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తల సమక్షంలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా నరవదంపతులు కేక్ కట్ చేయగా అభిమానులు ఘనంగా శుభాకాంక్షలు తెలియజేశారు. దైవ అనుగ్రహంతో రాజకీయంగా మరింత ఉన్నత స్థాయికి ఎదిగి, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలతో పాటు అన్ని వర్గాల ప్రజలకు మరింత విస్తృతంగా సేవలందించాలని అభిమానులు ఆకాంక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడిన నరవ రమాకాంత్ రెడ్డి మాట్లాడుతూ, "ప్రజల ప్రేమ, అభిమానుల ఆశీస్సులే మాకు శ్రీరామరక్ష. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ సేవా మార్గంలో మరింత అంకితభావంతో పనిచేస్తాం. ప్రతి కుటుంబానికి చేరువై ప్రజా సమస్యల పరిష్కారమే మా లక్ష్యం" అని పేర్కొన్నారు. వివాహ దినోత్సవాన్ని కేవలం వేడుకకే పరిమితం చేయకుండా సామాజిక బాధ్యతతో నిర్వహించడం విశేషంగా నిలిచింది. "పూలమాలలు -- శాలువాలు వద్దు... విద్యా సామగ్రి ముద్దు" అనే వినూత్న పిలుపునకు స్పందించిన అభిమానులు అందించిన పెన్నులు, నోట్‌బుక్స్, ఇతర విద్యా సామగ్రిని పెద్దకడబూరు జెడ్పీహెచ్ఎస్ పాఠశాల విద్యార్థులకు పంపిణీ చేశారు. విద్యార్థులకు పెన్నులు అందజేసి విద్య ద్వారానే ఉన్నత భవిష్యత్తు సాధ్యమవుతుందని దంపతులు సూచించారు. నరవ దంపతుల ఈ వినూత్న కార్యక్రమాన్ని ప్రజలు, విద్యార్థులు, ఉపాధ్యాయులు, అభినందిస్తూ, వ్యక్తిగత వేడుకలను సమాజానికి ఉపయోగపడే సేవా కార్యక్రమాలుగా మార్చడం అందరికీ ఆదర్శమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పెద్దకడబూరు, కంబళదిన్నే, మేకడోణ, చిన్నకడబూరు, దొడ్డి మేకల, మరువణి,పలు గ్రామాల,తెలుగుదేశం పార్టీ సినియర్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, శ్రేయోభిలాషులు, ఆధికసంఖ్యలో పాల్గొని నరవ దంపతులకు వివాహ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.ఈ వివాహ దినోత్సవ కార్యక్రమానికి సింగల్ విండో చైర్మన్ టి ఆంజనేయులు ఆధ్వర్యంలో భోజనాలు ఏర్పాటు చేశారు ఎం.రామన్న ఆధ్వర్యంలో కేక్ పూలమాల శాలువా ఏర్పాటు చేశారు... ఈ కార్యక్రమంలో మల్లమ్మ గారి నరసన్న,తెదేపా నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# హెచ్.మురువణి గ్రామంలో టీడీపీ మండల స్థాయి సమావేశం

టీడీపీ మండల అధ్యక్షులు గవిగట్టు మల్లికార్జున

మండలంలో ఉన్న ప్రజలకు తాగునీటి శాశ్వత పరిష్కారం కు కల్పించాలని అంశంపై తీర్మానం







**పెద్దకడబూరు,జూలై,15,ప్రభ మనం:** పెద్దకడబూరు మండలం హెచ్.మురువణి గ్రామంలో పెద్దకడబూరు మండల తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో మండల స్థాయి సమావేశం ఘనంగా నిర్వహించారు.మండల టిడిపి అధ్యక్షులు గవిగట్టు మల్లికార్జున అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో మండల ప్రజల సంక్షేమం,గ్రామీణాభివృద్ధి మరియు మౌలిక వసతుల కల్పనకు సంబంధించిన పలు ముఖ్యమైన ప్రజాప్రయోజన తీర్మానాలను చర్చించి ఏకగ్రీవంగా ఆమోదించారు. సమావేశంలో మండల ప్రజలను ఎన్నో సంవత్సరాలుగా వేధిస్తున్న శాశ్వత తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం కల్పించాలనే అంశంపై తీర్మానం చేశారు.అలాగే రైతులకు సమృద్ధిగా నీరు అందేలా సాగునీటి సదుపాయాలను మెరుగుపరచాలని, గ్రామాల మధ్య రాకపోకలకు ఇబ్బందులు లేకుండా గ్రామీణ రహదారులను అభివృద్ధి చేయాలని, విద్యార్థులకు మెరుగైన అవకాశాలు కల్పించేలా విద్యారంగ అభివృద్ధికి చర్యలు చేపట్టాలని,పేద మరియు నిరుపేద కుటుంబాలకు గృహ నిర్మాణాల మంజూరు,గృహ సదుపాయాల కల్పనపై తీర్మానాలు ఆమోదించారు.అదే విధంగా ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమం ఎస్ ఐ ఆర్ గడువు పెంపును ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నాయకులు పిలుపునిచ్చారు.ఇంకా ఓటరు జాబితాలో పేరు నమోదు కాని అర్హులైన ఓటర్లు,18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న కొత్త ఓటర్లు తమ పేర్లను నమోదు చేసుకోవాలని, అలాగే ఓటరు జాబితాలో సవరణలు, మార్పులు అవసరమైన వారు గడువు ముగిసేలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ప్రతి తెలుగుదేశం పార్టీ కార్యకర్త తమ పరిధిలోని అర్హులైన ప్రతి ఓటరిని నమోదు చేయించేందుకు కృషి చేయాలని సమావేశంలో నిర్ణయించారు. ఈ తీర్మానాలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి అమలు జరిగేలా కృషి చేస్తామని మండల టిడిపి అధ్యక్షులు గవిగట్టు మల్లికార్జున తెలిపారు.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్ర అభివృద్ధితో పాటు గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కూడా ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బొగ్గుల కోడిగుడ్ల యేసేపు,బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ బాబురావు స్వామి,మండల ఉపాధ్యక్షుడు విజయ్,జనరల్ సెక్రెటరీ రామాంజనేయులు,మండల కార్యదర్శి కురువ ఈరన్న,సొసైటీ చైర్మన్ కందనాతి నరసప్ప, క్లస్టర్ ఇంచార్జ్ మురళి, మండల ఆర్గనైజింగ్ సెక్రటరీ మునెప్ప,తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు సంజీవయ్య,యూనిట్ ఇన్చార్జిలు తలారి అంజి,గవిగట్టు రాజశేఖర్,ఈరన్న స్వామి,దొడ్డి మేకల రాఘవేంద్ర,గవిగట్టు హనుమంతు,ఉప్పరి ఈరన్న,చిన్న కొండయ్య, కొండయ్య,హెచ్ మురవణి గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు చంటి,ఉపాధ్యక్షులు నరసయ్య, రామ్మూర్తి,మధు,రంగయ్య,యూనిట్ ఇంచార్జ్ దుమ్మలు శివన్న, సాగునీటి సంఘం ప్రెసిడెంట్ సత్తన్న గౌడ్,డీలర్ జనార్ధన్,శ్రీనివాసులు,సురేష్, రామలింగ,తెలుగుదేశం పార్టీ యువ నాయకులు వీరేష్,సురేష్,ఆంజనేయ,నరసింహులు, చెన్నకేశవ,రామకృష్ణ,పార్టీ కార్యకర్తలు మరియు గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు అండగా ఉంటా రైతులకు ఏ నష్టం జరిగినా వారి పక్షాన పోరాడుతా

రైతు భరోసా కేంద్రాల వ్యవస్థను నిర్వీర్యం చేసి రైతులను క్యూల్లో నిలబెట్టిన కూటమి ప్రభుత్వం

వైఎస్ జగన్ అమలు చేసిన రైతు సంక్షేమ విధానాలను ధ్వంసం చేస్తూ రైతులపై అదనపు భారం మోపుతోంది --

మాజీ ఎంపీ శ్రీమతి బుట్టా రేణుక




**ఎమ్మిగనూరు,జూలై,15,ప్రభ మనం:** వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కర్నూలు పార్లమెంట్ సమన్వయకర్త, మాజీ ఎంపీ శ్రీమతి బుట్టా రేణుక టీడీపీ--కూటమి ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. రాష్ట్రంలో రైతుల సంక్షేమానికి పెద్దపీట వేసిన వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం అమలు చేసిన రైతు సంక్షేమ విధానాలను ఒక్కొక్కటిగా నిర్వీర్యం చేస్తూ రైతులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మిగనూరులో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ, వైఎస్ జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో రైతు భరోసా కేంద్రాల (=దీఖం) ద్వారా గ్రామ స్థాయిలోనే రైతులకు అవసరమైన ప్రతి ప్రభుత్వ సేవను అందుబాటులోకి తీసుకువచ్చారని గుర్తు చేశారు. నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, పంట నమోదు (వ-జతీశీజూ), రైతు బీమా, పంట నష్టపరిహారం, వ్యవసాయ సలహాలు, మార్కెటింగ్ సేవలు, ఇతర ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు అన్నీ రైతు భరోసా కేంద్రాల ద్వారానే పారదర్శకంగా అందించబడేవని తెలిపారు. వైఎస్ జగన్ ప్రభుత్వ హయాంలో రైతులు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి లేదని, గ్రామంలోనే అన్ని సేవలు అందుబాటులో ఉండడంతో రైతు సమయం, శ్రమ, డబ్బు ఆదా అయ్యేవని చెప్పారు. రైతును గౌరవించిన ప్రభుత్వం వైఎస్ జగన్ ప్రభుత్వమైతే, రైతును అవమానిస్తున్న ప్రభుత్వం నేటి టీడీపీ--కూటమి ప్రభుత్వమని తీవ్రంగా విమర్శించారు. నేడు రైతు భరోసా కేంద్రాల వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేయడంతో రైతులు మీ సేవా కేంద్రాల వద్ద తెల్లవారుజామున నుంచే క్యూల్లో నిలబడాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. ఒకరోజు ప్రకటన చేసి మరుసటి రోజే వెబ్‌సైట్ నిలిపివేయడం, సాంకేతిక లోపాల వల్ల వేలాది మంది రైతులు పంట నమోదులు పూర్తి చేయలేక తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని పేర్కొన్నారు. రైతుల విలువైన సమయాన్ని వృథా చేస్తూ, ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిప్పడం రైతు వ్యతిరేక పాలనకు నిదర్శనమని అన్నారు. గతంలో రైతు బీమా ప్రీమియాన్ని పూర్తిగా ప్రభుత్వమే భరించేదని, ఇప్పుడు మాత్రం బీమా పేరుతో రైతులపై అదనపు ఆర్థిక భారం మోపడం అత్యంత దురదృష్టకరమని పేర్కొన్నారు. రైతు సంక్షేమాన్ని భారంగా మార్చడం కూటమి ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనమని విమర్శించారు. ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీలన్నింటినీ గాలికొదిలేసిన టీడీపీ నాయకులు, అధికారంలోకి వచ్చిన తర్వాత ఒక్క హామీని కూడా అమలు చేయలేకపోయారని మండిపడ్డారు. "రైతులకు ఇంకా మెరుగైన బీమా, మరింత మేలు చేస్తాం" అని చెప్పి నేడు రైతులను మోసం చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్ర అభివృద్ధి విషయంలో కూడా ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆమె అన్నారు. మూడు రాజధానులను వ్యతిరేకించిన వారే ఇప్పుడు అభివృద్ధి పేరుతో కొత్త కొత్త మాటలు చెప్పడం ప్రజలను మభ్యపెట్టడమేనని పేర్కొన్నారు. వైఎస్ జగన్మోహన్ రెడ్డి గారు అప్పుడే కారిడార్ ఆధారిత అభివృద్ధి ద్వారా రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు సమాన అవకాశాలు కల్పించే దూరదృష్టితో ముందుకు వచ్చారని, పరిశ్రమలు, పెట్టుబడులు, ఉపాధి అవకాశాలు విస్తరించే ఆ విజన్‌ను "రైతు పక్షపాతి ప్రభుత్వం మాది" అని ఎన్నికల సమయంలో చెప్పిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, నేడు రైతులను క్యూల్లో నిలబెట్టి, కార్యాలయాల చుట్టూ తిప్పుతూ, అదనపు ఆర్థిక భారం మోపుతూ రైతులను నట్టేట ముంచే విధానాలను అమలు చేస్తున్నారని బుట్టా రేణుక తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఈ సందర్భంగా శ్రీమతి బుట్టా రేణుక గారు మాట్లాడుతూ, "రైతులకు ఎలాంటి అన్యాయం జరిగినా నేను వారి పక్షాన నిలబడతాను. రైతుల హక్కుల కోసం నిరంతరం పోరాడుతాను. రైతు కన్నీరు తుడవడమే మా లక్ష్యం. రైతు ప్రయోజనాలను కాపాడే వరకు మా పోరాటం ఆగదు" అని స్పష్టం చేశారు. అనంతరం బుట్టా ఫౌండేషన్ చేపడుతున్న సేవా కార్యక్రమాల గురించి ఆమె వివరించారు. ప్రజలకు సేవ చేయడం తమ కుటుంబ సంప్రదాయమని, ప్రజల కష్టసుఖాల్లో భాగస్వాములుగా ఉండటమే బుట్టా ఫౌండేషన్ ధ్యేయమని తెలిపారు. ప్రభుత్వం స్పందించే వరకు వేచి చూడకుండా, అవసరం ఉన్న వెంటనే ప్రజలకు అండగా నిలవడం తమ బాధ్యతగా భావిస్తున్నామని చెప్పారు. ఎండల తీవ్రత, వర్షాభావ పరిస్థితుల కారణంగా పలు గ్రామాల్లో తాగునీటి సమస్యలు తలెత్తుతున్న నేపథ్యంలో, ఎమ్మిగనూరు నియోజకవర్గంలో ఏ గ్రామంలోనైనా తాగునీటి సమస్య ఉందని సమాచారం అందిన వెంటనే బుట్టా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంచినీటి ట్యాంకర్లను పంపించి స్వచ్ఛమైన తాగునీటిని ప్రజలకు అందిస్తున్నామని తెలిపారు. ఒక్క గ్రామం కూడా తాగునీటి కొరతతో ఇబ్బందులు పడకూడదనే సంకల్పంతో ఈ సేవా కార్యక్రమాన్ని నిరంతరంగా కొనసాగిస్తున్నామని చెప్పారు. తాగునీరు ప్రతి మనిషి ప్రాథమిక హక్కు అని, ప్రజలు ఒక బిందె నీటి కోసం కిలోమీటర్ల దూరం నడవాల్సిన పరిస్థితి రావడం బాధాకరమని పేర్కొన్నారు. అలాంటి ఇబ్బందులు ప్రజలకు కలగకుండా బుట్టా ఫౌండేషన్ నిరంతరం పరిస్థితిని పర్యవేక్షిస్తూ, అవసరమైన చోట వెంటనే స్పందించి సేవలు అందిస్తోందని తెలిపారు. ప్రజల దాహార్తిని తీర్చడం కంటే గొప్ప సామాజిక సేవ మరొకటి లేదనే భావనతో ఎలాంటి ప్రచార ఆర్భాటం లేకుండా ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నామని చెప్పారు.రైతులు, వ్యవసాయ కూలీలు, పేదలు, వృద్ధులు, మహిళలు, చిన్నారులు సహా ప్రతి వర్గానికి అవసరమైన సమయంలో అండగా నిలవడం తమ బాధ్యతగా భావిస్తున్నామని పేర్కొన్నారు. ప్రజా సమస్యలను కేవలం మాట్లాడటానికే పరిమితం కాకుండా, వాటి పరిష్కారానికి ప్రత్యక్షంగా కృషి చేయడమే తమ విధానమని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వాన్ని ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ, రైతులకు ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని వెంటనే అమలు చేయాలని, రైతు భరోసా కేంద్రాల ద్వారా గతంలో అందించిన అన్ని సేవలను యథాతథంగా పునరుద్ధరించాలని, రైతు బీమా ప్రీమియాన్ని పూర్తిగా ప్రభుత్వమే భరించాలని, పంట నమోదు ప్రక్రియను సులభతరం చేసి రైతులను ఇబ్బందులకు గురిచేయకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. "రైతులకు ఎలాంటి అన్యాయం జరిగినా, ప్రజలకు ఎలాంటి కష్టం వచ్చినా నేను వారి పక్షాన నిలబడి పోరాడుతాను. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవడం నా బాధ్యత. బుట్టా ఫౌండేషన్ ద్వారా సేవా కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయి. ప్రజల కోసం మా ఇంటి తలుపులు ఎల్లప్పుడూ తెరిచే ఉంటాయి" అని శ్రీమతి బుట్టా రేణుక స్పష్టం చేశారు.

ప్రభ మనం TELUGU DAILY Gmail: prabhamanam@gmail.com RNI/APTEL/26/A3829
గురువారం 16- 07 - 2026

# పంటల బీమా ఇవ్వకుండా రైతులను అప్పుల ఊబిలోకి నెట్టొద్దు...!

## 2024--25 పంటల బీమా నిధులను వెంటనే విడుదల చేయాలి.




**జులై 15:( ప్రభ మనం న్యూస్ తుగ్గలి:** 2024--25 సంవత్సరానికి సంబంధించిన పంటల బీమా నిధులను తక్షణమే విడుదల చేసి ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఎం మండల కన్వీనర్ శ్రీరాములు డిమాండ్ చేశారు.ఈ మేరకు బుధవారం రోజున తుగ్గలి వ్యవసాయ కార్యాలయంలో వ్యవసాయ విస్తరణాధికారి లక్ష్మీ నారాయణ కు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటలు దెబ్బతిని ఏడాది గడుస్తున్నా బీమా సొమ్ము రైతుల ఖాతాల్లో జమ కాకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమన్నారు.వరుసగా ఎదురైన పంట నష్టాలతో రైతులు తీవ్ర ఆర్థిక సంక్షోభంలో చిక్కుకుని అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.రైతులకు భరోసా కల్పిస్తామని హామీలు ఇచ్చిన ప్రభుత్వం,పరిహారం చెల్లించే సమయంలో మాత్రం చేతులు దులుపుకుంటోందని విమర్శించారు. వ్యవసాయమే రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక అని చెప్పే పాలకులు, అదే రైతు కష్టాల్లో ఉన్నప్పుడు స్పందించకపోవడం బాధాకరమన్నారు.విత్తనాలు, ఎరువులు,పురుగుమందుల ధరలు భారీగా పెరగడంతో సాగు వ్యయం రెట్టింపైందని,మరోవైపు పంటలకు గిట్టుబాటు ధర లేకపోవడం,బీమా నిధులు కూడా అందకపోవడంతో రైతు అన్ని వైపులా నష్టపోతున్నాడని తెలిపారు.పంట నష్టాల అంచనా ప్రక్రియ పూర్తయినప్పటికీ బీమా క్లెయిమ్‌లు ఏ దశలో ఉన్నాయనే విషయాన్ని ప్రభుత్వం వెల్లడించకపోవడం అనుమానాలకు తావిస్తోందన్నారు.రైతులకు రావాల్సిన బీమా నిధుల విడుదలలో ఎందుకు జాప్యం జరుగుతోందో ప్రభుత్వం బహిరంగంగా వెల్లడించాలని డిమాండ్ చేశారు.రైతు కష్టకాలంలో అండగా నిలవాల్సిన ప్రభుత్వం బీమా చెల్లింపులను వాయిదా వేయడం రైతు వ్యతిరేక విధానమని సిపిఎం మండిపడింది. వెంటనే 2024--25 పంటల బీమా బకాయిలను విడుదల చేసి అర్హులైన ప్రతి రైతు ఖాతాలో జమ చేయాలని డిమాండ్ చేసింది.అలాగే పంటల బీమా దరఖాస్తు ప్రక్రియలో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. బీమా కోసం దరఖాస్తు చేసుకోవాలంటే సిఎస్సీ కేంద్రాల వద్ద ఉదయం నుంచి రాత్రి 11 గంటల వరకు వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొందని తెలిపారు.ఈ ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని స్వర్ణ గ్రామం--స్వర్ణ వార్డు సచివాలయాల్లో కూడా పంటల బీమా దరఖాస్తులు స్వీకరించే ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. దీంతో రైతులకు సమయం, ఖర్చు ఆదా కావడంతో పాటు దరఖాస్తు ప్రక్రియ మరింత సులభతరం అవుతుందన్నారు.ప్రభుత్వం వెంటనే పంటల బీమా నిధులను విడుదల చేసి రైతుల సమస్యలను పరిష్కరించకపోతే రైతులు, వ్యవసాయ కార్మికులను సమీకరించి మండల,జిల్లా కేంద్రాల్లో ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.రైతుల పట్ల చిత్తశుద్ధి ఉంటే ఇకనైనా ప్రభుత్వం ఆలస్యం చేయకుండా బీమా నిధులను విడుదల చేసి రైతులకు న్యాయం చేయాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున రైతులు,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఇందులో నెలకు రూ.5000 ఇన్వెస్ట్ చేస్తే కోటి రూపాయలు!



ప్రతి ఒక్కరికి లక్షాధికారి కావాలనే కోరిక ఉంటుంది. కానీ అందరికి సాధ్యం కాకపోవచ్చు. కొన్ని మార్గాల ద్వారా డబ్బు సంపాదించుకునే అవకాశం ఉంటుంది. కొన్నింటిలో ఇన్వెస్ట్‌మెంట్ చేస్తే మంచి రాబడి పొందవచ్చంటున్నారు నిపుణులు. అది చాలా చిన్న మొత్తం అయినప్పటికీ, అది కూడా ప్రతి నెలా మీరు పెద్ద మొత్తంలో పెట్టుబడి పెట్టవలసిన అవసరం లేదు. ఇప్పుడు మీరు లక్షాధికారి ఎలా అవుతారో మరింత తెలుసుకుందాం. ప్రతి వ్యక్తి తమ నెలవారీ ఆదాయంలో కొంత భాగాన్ని ఆదా చేసి మంచి ప్రణాళికలో పెట్టుబడి పెట్టాలి. మంచి ప్రణాళికలో పెట్టుబడి పెట్టడం ద్వారా మీరు మీ భవిష్యత్తును సురక్షితంగా ఉంచుకోవచ్చు. మీరు మంచి లాభాలను కూడా పొందవచ్చు. పెట్టుబడి పెట్టడానికి ప్రజలకు అనేక ఎంపికలు అందుబాటులో ఉన్నాయి. చాలా మంది పోస్ట్ ఆఫీస్ పథకాలలో పెట్టుబడి పెడితే, చాలామంది బ్యాంక్ లలో పెట్టుబడి పెట్టడానికి ఇష్టపడతారు. అదే సమయంలో మ్యూచువల్ ఫండ్ %ూ%ూ%లలో పెట్టుబడి పెట్టడం ప్రజలలో బాగా ప్రాచుర్యం పొందుతోంది.

**మ్యూచువల్ ఫండ్లలో %ూ%ూ% పెట్టుబడికి మంచి ఎంపిక.**

ఈ రోజుల్లో చాలా మంది మ్యూచువల్ ఫండ్ లలో డబ్బు పెట్టుబడి పెట్టడానికి ఇష్టపడుతున్నారు. మరోవైపు మీరు చాలా కాలం పాటు మ్యూచువల్ ఫండ్ క్రమం తప్పకుండా పెట్టుబడి పెడితే, మీరు కోట్ల రూపాయల నిధులను కూడబెట్టుకోవచ్చు. మ్యూచువల్ ఫండ్లలో దీర్ఘకాలిక పెట్టుబడి సిప్ ద్వారా గరిష్టంగా 12 శాతం రాబడిని పొందవచ్చు. ఇది మార్కెట్ లింక్డ్ పథకం. అటువంటి సందర్భంలో మార్కెట్‌ను బట్టి రాబడి కూడా హెచ్చుతగ్గులకు లోనవుతుంది.


**5000 సిప్‌తో కోటి రూపాయలు:**

మీరు మ్యూచువల్ ఫండ్ నెలకు రూ. 5000 దీర్ఘకాలం పాటు పెట్టుబడి పెడితే, మీరు రూ. 1 కోటి వరకు నిధిని కూడబెట్టుకోవచ్చు. దీని కోసం, మీరు వరుసగా 27 సంవత్సరాలు ప్రతి నెలా రూ. 5000 పెట్టుబడి పెట్టాలి. మీరు వరుసగా 27 సంవత్సరాలు ప్రతి నెలా రూ. 5,000 పెట్టుబడి పెడితే మీరు మొత్తం రూ. 16,20,000 పెట్టుబడి పెడతారు. 12 శాతం రేటుతో మీరు 27 సంవత్సరాల తర్వాత మొత్తం రూ. 1,08,11,565 నిధిని అందుకుంటారు. దీనిలో మీకు మొత్తం రూ. 91,91,565 లాభం లభిస్తుంది టాప్-అప్ సాధారణ కంటే భిన్నంగా ఉంటుంది. టాప్-అప్ ద్వారా మ్యూచువల్ ఫండ్లలో పెట్టుబడి పెట్టడం వల్ల ఎక్కువ లాభాలు వస్తాయి. నిజానికి, టాప్-అప్ %ూ%ూ%లో మీరు ప్రతి నెలా మీ 10 శాతం పెంచాలి.

**మీ అద్దెదారు, ఉద్యోగి మీకు ఇచ్చే ఆధార్ నకిలీదా? కాదా? గుర్తించడం ఎలా?**

మీరు వరుసగా 20 సంవత్సరాలు ప్రతి నెలా రూ. 10,000 పెట్టుబడి పెడితే, మీరు మొత్తం రూ. 24 లక్షలు పెట్టుబడి పెడతారు. మీరు 12 శాతం రాబడిని పొందితే 20 సంవత్సరాల తర్వాత మీకు మొత్తం రూ. 99.91 లక్షలు లభిస్తాయి. దీనిలో మీకు రూ. 75.91 లక్షల లాభం లభిస్తుంది.

# ఎండలతో కార్లకు తీవ్ర నష్టం.. ఈ చిట్కాలు పాటిస్తే ఉపశమనం..



వేసవి నేపథ్యంలో ఎండలు విపరీతంగా పెరిగిపోయాయి. ఉదయం 8 గంటలు దాటితే చాలు సూర్యుడు తన ప్రతాపాన్ని చూపుతున్నాడు. ఒక మధ్యాహ్నం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ రోడ్లపై జన సంచారం కనిపించడం లేదు. అత్యవసర పనులైతే తప్ప మామూలుగా ఎవ్వరూ బయటకు రావడం లేదు. ఎండ వేడిమి నుంచి రక్షించుకోవడానికి ప్రజలు అనేక జాగ్రత్తలు తీసుకుంటున్నారు. అయితే ఎండ వల్ల మనుషులకే కాదు కార్లకు కూడా అనేక నష్టాలు కలుగుతాయి. వాటిని కూడా చాలా జాగ్రత్తగా చూసుకోవాలి. ఈ నేపథ్యంలో ఎండ నుంచి కార్లను రక్షించుకునే చిట్కాలను ఇప్పుడు తెలుసుకుందాం. దేశంలోని దాదాపు అన్ని ప్రాంతాల్లో ప్రస్తుతం 40 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఇలాంటి సమయంలో కార్లను కూడా చాలా జాగ్రత్తగా చూసుకోవాలి. ఎండలో డ్రైవింగ్ చేయడం వల్ల మీకు అసౌకర్యం కలగడంతో పాటు కారుకూ నష్టం వాటిల్లుతుంది. ముఖ్యంగా విండ్ షీల్డ్ పగుళ్లు తీస్తుంది. పెయింట్ వాడిపోయే ప్రమాదం ఉంది. అధిక వేడి కారణంగా టైర్లు హీటెక్కిపోతాయి. ఇలాంటి సమయంలో ఈ కింద తెలిసిన విధంగా కార్లను సంరక్షించుకోవాలి. ఎండా కాలంలో కారును వాడకుండా ఇంటిలోనే ఉంచడం కుదరదు. మన అవసరాలకు అనుగుణంగా దాన్ని ఉపయోగించుకోవాలి. కాబట్టి సాధ్యమైనంత వరకూ కారును నీడ కింద పార్కు చేయాలి. ఎందుకంటే సుమారు 30 నిమిషాల పాటు కారు ఎండలో ఉంటే లోపలి ఉష్ణోగ్రతలు గణనీయంగా పెరుగుతాయి. ప్రయాణం సమయంలో ఒక అరగంట పాటు చెట్ల కింద ఆపడం వల్ల మీతో పాటు కారుకు మంచి జరుగుతుంది. క్యాబిన్ చల్లబడడమే కాకుండా పెయింట్, డాష్ బోర్డు లో పగుళ్లు రాకుండా ఉంటాయి. పార్కింగ్ చేసే ప్రదేశాల్లో నీడ లేనప్పుడు సన్ షేడ్ లు, విండో నైజర్లను ఉపయోగించుకోవాలి. ఇవి సూర్యరశ్మిని నిరోధించి, కారు లోపలి భాగాన్ని చల్లగా ఉంచుతాయి. ముందు వెనుక ఉన్న కిటికీలపై వీటిని ఉంచడం మంచిది. అదే సమయంలో స్టీరింగ్ వీల్, సీట్లపై తువాళు కప్పడం మర్చిపోవద్దు. తువాళ్లపై నీటిని చల్లడం వల్ల మరింత చల్లదనం అందుతుంది. ఈ పద్ధతులు కారు లోపల భాగం వేడెక్కకుండా చూడటానికి ఎంతో సహాయ పడతాయి.

**ఒక్కసారి ఛార్జ్‌తో 449 కిలోమీటర్లు జాలీ జాలీగా..**

బయట గాలి కారు లోపలకు వెళ్లడానికి వీలుగా, లోపలి భాగం వేడెక్క కుండా ఉండేందుకు కొద్దిగా కిటికీల తెరవడం చాలా మంచిది. దీని వల్ల లోపలి గాలి బయటకు, బయట గాలి లోపలకు వెళ్లి ఉష్ణోగ్రతను తగ్గిస్తుంది. ఇటీవల సౌరశక్తితో పనిచేసే ఫ్యాన్లు ఎక్కువగా తయారవుతున్నాయి. వాటిని కారులో ఏర్పాటు చేసుకోవడం వల్ల ప్రయోజనం కలుగుతుంది. ఇంజిన్ ఆఫ్ లో ఉన్నప్పుడు క్యాబిన్ ఉష్ణోగ్రతను సరి చేస్తాయి. ఎండలో పార్కు చేసిన సమయంలోనూ ఉపయోగపడతాయి.

# పాకిస్థాన్ జెండాలు.. ఫ్లిప్‌కార్ట్, అమెజాన్‌కు కేంద్ర ప్రభుత్వ నోటీసులు!




కేంద్ర వినియోగదారుల సంరక్షణ అధికార సంస్థ అమెజాన్, ఫ్లిప్‌కార్ట్, ఉబియ్ వంటి ఇ-కామర్స్ ప్లాట్‌ఫామ్‌లకు నోటీసులు జారీ చేసింది. పాకిస్తాన్ జెండాలు, సంబంధిత వస్తువుల అమ్మకాలను వెంటనే నిషేధించాలని ఆదేశించింది. పాకిస్తాన్‌తో ఉన్న ఉద్రిక్తతల నేపథ్యంలో ఈ చర్య తీసుకున్నారు. జాతీయ భావాలకు విరుద్ధంగా ఉన్న వస్తువులను తొలగించాలని ప్లాట్‌ఫామ్‌లను కోరింది. పాకిస్తానీ జెండాలు, పాక్ సంబంధిత వస్తువుల అమ్మకాలపై అమెజాన్ ఇండియా, ఫ్లిప్‌కార్ట్, ఉబియ్ ఇండియా, ఎట్సీ వంటి ప్రధాన ఇ-కామర్స్ ప్లాట్‌ఫామ్‌లకు సెంట్రల్ కన్స్యూమర్ ప్రొటెక్షన్ అథారిటీ బుధవారం నోటీసులు జారీ చేసింది. అటువంటి వస్తువులు ఉంటే వెబ్‌సైట్ నుంచి వెంటనే తొలగించి, జాతీయ చట్టాలకు అనుగుణంగా ఉండేలా చూసుకోవాలని ప్లాట్‌ఫామ్‌లను ఆదేశించినట్లు కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహార మంత్రి ప్రహ్లాద్ జోషి తెలిపారు. దీనికి సంబంధించిన ఆయన ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఏప్రిల్ 22న జమ్మూ కశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిగిన ఉగ్రవాద దాడిలో ఒక నేపాలీ జాతీయుడు సహా 26 మంది పౌరులు ప్రాణాలు కోల్పోయిన తరువాత పాకిస్తాన్‌తో ఉద్రిక్తతల పెరిగిన విషయం తెలిసిందే. ఉగ్రదాడికి ప్రతీకారంగా భారత సైన్యం మే 7 తెల్లవారుజామున పాకిస్తాన్, పాకిస్తాన్ ఆక్రమిత కశ్మీర్‌లోని తొమ్మిది ఉగ్రవాద స్థావరాలను లక్ష్యంగా చేసుకుని 'ఆపరేషన్ సిందూర్'ను చేపట్టింది. ఈ ఆపరేషన్లో 100 మందికి పైగా ఉగ్రవాదులు హతమయ్యారు. అంతకుముందు భారతదేశంలో పనిచేస్తున్న ఈ-కామర్స్ ప్లాట్‌ఫామ్‌లలో పాకిస్తాన్ జెండాలు, ఇతర వస్తువుల అమ్మకాలను నిషేధించాలని కాన్ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా ట్రేడర్స్ కేంద్ర వాణిజ్య మంత్రి పియూష్ గోయల్, ప్రహ్లాద్ జోషిలను కోరింది. భారతదేశం ప్రత్యర్థిపై 'ఆపరేషన్ సిందూర్'ను ప్రారంభించినప్పటికీ, పాకిస్తాన్ జెండాలు, వస్తువులను ఈ-కామర్స్ ప్లాట్‌ఫామ్‌లలో జాబితా చేయవచ్చని పరిశ్రమ కేంద్ర మంత్రికి రాసిన లేఖలో రాసింది. మన జాతీయ భావాలు, సార్వభౌమాధికారం మూలాన్ని తాకే విషయంపై నా తీవ్ర ఆందోళనను వ్యక్తం చేయడానికి ఈ లేఖ రాస్తున్నట్లు తెలిపారు. అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ వంటి ప్రధాన ఇ-కామర్స్ ప్లాట్‌ఫామ్‌లలో పాకిస్తాన్ జెండాలు, లోగో ఉన్న మగ్గులు, టీ-షర్టులు బహిరంగంగా అమ్ముడవుతున్నాయని వెలుగులోకి వచ్చింది అని జాతీయ అధ్యక్షుడు భారతీయ మంత్రి గోయల్‌కు రాసిన లేఖలో పేర్కొన్నారు. మన సాహసోపేతమైన సాయుధ దళాలు పాకిస్తాన్‌కు వ్యతిరేకంగా జాతీయ ప్రాముఖ్యత కలిగిన ఆపరేషన్ సిందూర్‌లో చురుకుగా నిమగ్నమై ఉన్నప్పటికీ ఈ ఆందోళనకరమైన పరిస్థితి బయటపడుతుంది అని ఆయన అన్నారు. మన దేశాన్ని కాపాడుకోవడానికి మన సైనికులు అసమానమైన ధైర్యం, త్యాగాలను ప్రదర్శిస్తున్న సమయంలో శత్రు దేశాన్ని సూచించే వస్తువులను అమ్మడం అసహ్యకరమైనది మాత్రమే కాదు, పూర్తిగా ఆమోదయోగ్యం కాదని ఆ సంస్థ తెలిపింది. ఈ నేపథ్యంలో భారతదేశంలో పనిచేస్తున్న అన్ని ఈ-కామర్స్ ప్లాట్‌ఫామ్‌లలో పాకిస్తానీ జెండాలు, లోగోలు, ఇతర సంబంధిత వస్తువుల అమ్మకాలను వెంటనే నిషేధించాలని ఈ-కామర్స్ సంస్థలకు ఆదేశాలు జారీ చేయాలని భారత ప్రభుత్వాన్ని కోరింది.

# శ్రీ మఠం హుండీ ఆదాయం రూ. 3.71 కోట్లు

-శ్రీమఠ మేనేజర్ ఎస్కే శ్రీనివాసరావు



**మంత్రాలయం,జూలై 15,(మనం న్యూస్) :** ప్రసిద్ధ పుణ్యక్షేత్రం మంత్రాలయం శ్రీ రాఘవేంద్ర స్వామి మఠం ,జూన్ ,జూలై నెల 22రోజుల హుండీ ఆదాయం రూ. 3,71,35,259 లు సమకూరినట్లు మఠం మేనేజర్ ఎస్కే శ్రీనివాసరావు బుధవారం వెల్లడించారు. బంగారం 23 గ్రాములు , వెండి 1085 , గ్రాములను భక్తులు కానుకులుగా హుండీ లో సమర్పించుకున్నారని మేనేజర్ తెలిపారు.

# జియో మైసూర్ వారి సౌజన్యంతో బొల్లవానిపల్లి లో వాటర్ ప్లాంట్ ప్రారంభం

ప్రజలకు అందుబాటులో స్వచ్ఛమైన నీరు డైరెక్టర్ కృష్ణ.







**జులై,:15.( ప్రభ మనం న్యూస్ తుగ్గలి:** మండలంలోని పగిడిరాయి గ్రామంలో జొన్నగిరి గోల్డ్ మైన్స్ సంస్థ సౌజన్యంతో ఏర్పాటు చేసిన స్వచ్ఛమైన త్రాగునీటి వాటర్ ప్లాంట్‌ను బుధవారం రోజున సంస్థ ప్రతినిధులు,గ్రామ ప్రజాప్రతినిధులు ఘనంగా ప్రారంభించారు.గ్రామ ప్రజలకు నాణ్యమైన,స్వచ్ఛమైన త్రాగునీరు అందించాలనే సామాజిక బాధ్యతతో ఈ ప్లాంట్‌ను ఏర్పాటు చేసినట్లు జొన్నగిరి గోల్డ్ మైన్స్ డైరెక్టర్ కృష్ణ తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,గ్రామీణ ప్రాంతాల్లో స్వచ్ఛమైన త్రాగునీటి కొరతను తగ్గించడం,ప్రజల ఆరోగ్య పరిరక్షణకు తోడ్పడడం సంస్థ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.సంస్థ సామాజిక బాధ్యత కార్యక్రమాల్లో భాగంగా విద్య,వైద్యం,తాగునీరు, మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు. భవిష్యత్తులో కూడా ప్రజలకు ఉపయోగపడే మరిన్ని సంక్షేమ కార్యక్రమాలను చేపడతామని హామీ ఇచ్చారు.గ్రామ ప్రజలు ఈ వాటర్ ప్లాంట్‌ను సద్వినియోగం చేసుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఆయన సూచించారు.గ్రామంలో ఈ సౌకర్యం అందుబాటులోకి రావడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తూ జొన్నగిరి గోల్డ్ మైన్స్ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సభ్యులు జగన్నాథ్ రెడ్డి, సాగునీటి సంఘం మాజీ అధ్యక్షులు ఈశ్వర్ రెడ్డి,తెలుగుదేశం పార్టీ నాయకులు నక్కల దామోదర్, జొన్నగిరి గోల్డ్ మైన్స్ జనరల్ మేనేజర్ బాలాజీ,ప్రజా సంబంధాల అధికారి రాజేష్,డిప్యూటీ ఎంపీడీవో శ్రీహరి, గ్రామ పెద్దలు,ప్రజా ప్రతినిధులు,సంస్థ అధికారులు,గ్రామస్థులు పాల్గొన్నారు.

# హెల్మెట్ తప్పనిసరి.. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి: తుగ్గలి ఎస్సై నరేష్




**తుగ్గలి, జూలై 15 (ప్రభ మనశీ న్యూస్):** తుగ్గలి పోలీస్ స్టేషన్ ఎస్సై నరేష్ బుధవారం ప్రజలకు పలు కీలక అంశాలపై అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, రోడ్డు భద్రతా నిబంధనలను పాటించి ప్రమాదాలను నివారించాలని సూచించారు. మహిళల భద్రతకు పోలీసులు ఎల్లప్పుడూ అండగా ఉంటారని, అత్యవసర పరిస్థితుల్లో వెంటనే పోలీసులను సంప్రదించాలని తెలిపారు. అలాగే ఐవీఆర్ఎస్ కాల్స్‌పై ప్రజలు స్పందించి తమ అభిప్రాయాలను తెలియజేయాలని కోరారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, తెలియని వ్యక్తుల ఫోన్ కాల్స్, లింకులు, ఓటీపీలు, బ్యాంకు వివరాలు ఎవరికీ చెప్పవద్దని హెచ్చరించారు. అనుమానాస్పద ఘటనలు ఎదురైతే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ఎస్సై నరేష్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# షుగర్ లెవెల్స్ కంట్రోల్లో ఉండాలంటే పచ్చడి తినాల్సిందే..!

పచ్చళ్లలో మంచి సూక్ష్మజీవులు ఉంటాయి.. వాటిని ప్రోబయోటిక్స్ అంటారు. ఇవి మన కడుపులో ఉండే మంచి బ్యాక్టీరియాను పెంచుతాయి. మంచి బ్యాక్టీరియా పెరగడం వల్ల మనం తిన్న ఆహారం బాగా జీర్ణమవుతుంది. దీని వల్ల నీరసం తగ్గి.. మనకు ఎక్కువ శక్తి వస్తుంది. అయితే కడుపులో మంట లేదా పుండు ఉన్నవారు మాత్రం పచ్చళ్లను ఎక్కువగా తినకూడదు. అలా తింటే వారి సమస్యలు పెరిగే అవకాశం ఉంది. పచ్చళ్లలో కేలరీలు చాలా తక్కువగా ఉంటాయి. అందుకే బరువు తగ్గాలనుకునే వారికి ఇవి బాగా సహాయపడతాయి. బరువు పెరిగే సమస్యతో బాధపడేవారు పచ్చళ్లు తింటే బరువు అదుపులో ఉంటుంది. కానీ ఎప్పుడూ కొద్దిగానే తినాలి. ఎక్కువ తింటే మాత్రం సమస్యలు రావచ్చు. కాబట్టి పచ్చళ్లను తగినంత పరిమాణంలో తీసుకోవడం మంచిది. కండరాల నొప్పులు తగ్గించడంలో కూడా పచ్చళ్లు సహాయపడతాయి. వ్యాయామం చేసిన తర్వాత వచ్చే కండరాల నొప్పిని తగ్గించడానికి ఇవి బాగా పనిచేస్తాయి. ఇది ఆటలు ఆడేవారికి లేదా వ్యాయామం చేసేవారికి చాలా ఉపయోగకరంగా ఉంటుంది. కండరాల నొప్పి తగ్గితే శరీరం బాగా పనిచేస్తుంది.. అలాగే శక్తి కూడా ఎక్కువగా ఉంటుంది. రక్తంలో చక్కెర స్థాయిని అదుపులో ఉంచడంలో పచ్చళ్లు ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి. పచ్చళ్లలో ఉండే పోషకాలు రక్తాన్ని ఎక్కువగా పెరగకుండా చూస్తాయి. దీని వల్ల డయాబెటిస్ వచ్చే ప్రమాదం తగ్గుతుంది. రక్తంలో చక్కెర సరైన స్థాయిలో ఉంటే మన ఆరోగ్యం బాగుంటుంది.

Office adress....EDITED & PUBLISHED AND OWNED BY.EDITOR : V.LINGAMURTHY. PUBLISHED AT : VSAR PUBLICATION VSAR PUBLICATIONS91/4-31-3-1B, BALAJINAGAR, KURNOOL, ANDHRA PRADESH - 518006CONTACT NO :9000367833.RNI,APTEL/26/A 3829,E-MAIL.ID prabhamanam@gmail.com